క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి..



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు పార్థసారథి, తదితరులు

విజయనగరం రూరల్: పారిశుధ్య నిర్వహణలో రాత్రనక, పగలనక పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని భవ్య ఫౌండేషన్ అధ్యక్షుడు గంటా పార్థసారథి అన్నారు. పట్టణంలోని కేఎల్ పురం రెవెన్యూ కాలనీ అసోసియేషన్, భవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది మంది కార్మికులకు దుస్తులు, పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం



చాకివలసలో గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

భోగాపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని భోగాపురం, చాకివలస గ్రామాల్లో రైతులకు మంజూరు చేసిన గోకులం షెడ్‌లను జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉడికల అప్పయ్యమ్మ, లంక వెంకటలక్ష్మి, సీహెచ్‌సీ ఆస్పత్రి కమిటీ మెంబర్ బొల్లు త్రినాథ్, నీటి సంఘం ప్రెసిడెంట్ వరుపుల గిరి, ఎన్డీఏ కూటమి నాయకులు పల్ల రాంబాబు, పసుపులేటి లోకేష్, బొద్ద రమణబాబు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏపీఓ భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. విజయనగరం, ఎస్.కోట, పార్వతీపురం డిపోలకు చెందిన నాలుగు కొత్త బస్సులకు స్థానిక విజయనగరం డిపో ఆవరణలో పచ్చజెండా ఊపారు. అనంతరం డిపో గేరేజీ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్ను దొర, ఈడీ ఎ.విజయకుమార్, జిల్లా ప్రజారవాణా అధికారులు సీహెచ్.అప్పలనాయుడు (విజయనగరం), కె.శ్రీనివాసరావు (పార్వతీపురం), ఎస్‌కోట, విజయనగరం డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు, కార్మిక సంఘ నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు



పొంగలి తయారుచేస్తున్న అధ్యాపకులు విద్యార్థులు

విజయనగరం అర్బన్: తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. తొలుత భోగి మంటను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంక్రాంతి పొంగలి తయారు చేశారు. గంగిరెద్దులు, హరిదాసుల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు గాలిపటాలు ఎగురవేశారు. విద్యార్థినులు రంగవల్లులు వేసి సందడి చేశారు. వివిధ పోటీల విజేతలకు కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వితరణ..



తన మాతృమూర్తి దాడిచిలుక మంగమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని పినవేమలిలో ఉన్న ఏబీసీడీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సీట్లు, పండ్లు, దుప్పట్లను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి వృద్ధాశ్రమాలకు ప్రభుత్వమే సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. విజయనగరం అర్బన్

పల్లెకు పోదాం చలోచలో..

- సంక్రాంతికి సొంత గూటికి పయనమవుతున్న ప్రజానీకం
- అతిథులకు స్వాగతమిస్తున్న గ్రామీణ ప్రాంతాలు



కిటకిటలాడుతున్న ఆర్టీసీ కాంప్లెక్స్

విజయనగరం: హరిలో రంగ హరి అంటూ సమస్తం చల్లగా ఉండాలని దీవించే హరిదాసుల కీర్తనలు.. అయ్యగారికి వందనం అమ్మగారికి చందనమంటూ డూడూ బసవన్న దీవెనలు.. వేకువజామున జంగమదేవరలు మోగించే గంటలు.. బుడబుక్కలి వాయించే ఢమరుక నాదాలు.. బడాయి పోతూ నాకేం తక్కువంటూనే మామూళ్లడిగే పిట్టలదొరలు.. చమత్కారాలతో చిందులేస్తూ ఎంతోకొంత సమర్పించుకుంటే కానీ కదలని కొమ్మ దాసరులు.. ఇలా చెప్పుకుంటే పోతే పెద్ద జాబితాయే పెద్ద పండుగది. సంక్రాంతి పండగ నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. పట్టణాలు, దూర ప్రాంతాల్లో ఉన్న వారందరూ పెద్ద పండగను ఘనంగా జరుపుకునేందుకు సొంత గ్రామాలకు తరలి వస్తుండడంతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి.



మరెన్నో విశేషాలు..

- చిన్ననాటి బాల్య స్నేహితులంతా స్వగ్రామాలకు వస్తుంటారు. అంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకునే సదావకాశం సంక్రాంతి ఇస్తుంది.
- కుటుంబంలో తరతరాలుగా ఉన్న వారంతా ఒకచోట చేరి పెద్ద పండగను ఘనంగా జరుపుకుంటారు.
- పూర్వ విద్యార్థులంతా కూడా ఒక వేదికపైకి చేరి గెట్ టుగెదర్ వంటి కార్యక్రమాలు చేపడతారు.
- పిల్లలకు ఇష్టమైన బొమ్మల కొలువు సంక్రాంతి ప్రత్యేకత. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు బొమ్మల కొలువు వద్ద చేసే సందడి అంతా ఇంతాకాదు.
- సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీల వంటివి పల్లెల్లో ప్రత్యేకం.
- కొన్నిచోట్ల చూస్తే సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తున్న కళాకారులను సన్మానిస్తుంటారు.

ప్రారంభమైన సందడి..

ధనుర్మాసం మొదలైనప్పటి నుంచి అంటే నెల రోజుల ముందుగానే పల్లెల్లో పండగ హడావిడి ప్రారంభమవుతుంది. ఇప్పటికే సంక్రాంతి పండగను పురస్కరించుకుని పల్లెల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా సందడి ప్రారంభమైంది. 13, 14, 15 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండగలను జరపుకునేందుకు తెలుగు ప్రజలు సన్నద్ధమయ్యారు. ఆకాశమంత ఆనందం.. భూ మండలమంత సంతోషం.. జతకలిస్తే ఎలా గుంటుందో సంక్రాంతి సందడి అలా ఉంటుంది. పల్లెల్లో వినూత్నంగా ఏది చేయాలన్నా సంక్రాంతే దానికి వేదిక వుతుంది. దేశవిదేశాల్లో ఉన్నోళ్లని సైతం స్వగ్రామాలకు రప్పించే శక్తి సంక్రాంతికే ఉందంటే అతిశయోక్తిలేదు. అంతేకాదండోయ్ ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లిన పల్లె జనం సైతం తప్పకుండా సొంత ఊర్లకు చేరుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రలతో కలిసి పండుగ జరుపుకుంటారు.

ప్రతి ఇంటా ప్రత్యేక వంట..

సంక్రాంతికి ప్రతి ఇంటిలోనూ ప్రత్యేక వంటలు చేస్తుంటారు. అరిసెలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు, కారంబూందీ, కారపూస, బొబ్బట్లు వంటి వంటకాలు సంక్రాంతి స్పెషల్ వంటకాలు. భోగీ రోజున భోగిమంటలో కాల్చిన వంకాయలతో చేసిన పచ్చడి, మకర సంక్రాంతి నాడు పులిహోర, గారెలు, పాయసం, కనుమకు గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యాల్లో మాంసాహారం ఉంటుంది. ఇవిగాకుండా ఇష్టాలనుబట్టి మరికొన్ని వంటలు చేసుకుంటారు.

కొత్త అల్లుళ్లకు మర్యాదలే వేరు..

కొత్త అల్లుళ్లకు సంక్రాంతి కానుకగా ద్విచక్రవాహనాలు ఇవ్వడం జిల్లాలో ఆనవాయితీ. ఆ ఏర్పాట్లలో మామయ్యలు మునిగి తేలుతున్నారు. ఇదిగాకుండా ఇంటికొచ్చిన బంధుమిత్రులకు నూతన దుస్తులు పెడుతుంటారు. పల్లెల్లో పిల్లలైతే భోగి మంటలో వేసేందుకు ఇప్పటికే పిడకలు తయారు చేసి సిద్ధం చేసుకున్నారు.



పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

మూడు రోజుల పాటు జన జాతర..

ఈ నెల 13, 14 , 15 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడ చూసినా జనజాతరలానే కనిపిస్తుంది. స్వగ్రామాలకు వచ్చిన వారంతా ఆయా వీధుల్లో తిరుగుతూ తెలిసినవారిని పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటుంటారు. పండగ రోజుల్లో అనాథలకు అన్నసమారాధనలు చేసే కుటుంబాలు జిల్లాలో కోకొల్లలు. వచ్చిన అతిథులకు లేకుండా అన్ని మర్యాదలు చేసే సత్సంప్రదాయం జిల్లా ప్రత్యేకత.

పందెంరాయుళ్లకు పండగే.. పండగ

సంక్రాంతి పండగ నేపథ్యంలో పందెంరాయుళ్ల హడావిడి అంతా ఇంతా కాదు. మూడు రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ పందాలు నిర్వహిస్తుంటారు. జూదంతో పాటు కోడిపందాలు జిల్లాలో జోరుగా సాగుతాయి. ఇందుకోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన వివిధ జాతుల కోళ్లు బరిలోకి దిగేందుకు కాళ్లు రువ్వుతున్నాయి. పందెంరాయుళ్లకు ఇదో వ్యసనమైనా... సాధారణ ప్రజలకు మాత్రం కోడిపందాలు కనువిందు చేస్తాయనడంలో సందేహం లేదు.

వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలి...



నెల్లిమర్ల: వివేకానంద విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



విజయనగరం ఫోర్ట్: నివాళులర్పిస్తున్న గ్రంథాలయ యువజన సంఘ సభ్యులు



విజయనగరం అర్బన్: సత్య కళాశాలలో వివేకానంద జయంతి



విజయనగరం టౌన్: గురజాడ కేంద్ర గ్రంథాలయంలో 'వికాసం' పుస్తకావిష్కరణ

స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ యువజన దినోత్సవం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించడంతో పాటు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.



పూసపాటిరేగ: వివేకానందుడి జయంతి సందర్భంగా ర్యాలీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, విద్యార్థులు

– సాక్షి నెట్‌వర్క్

సమగ్ర యువజన విధానంతోనే ఉపాధి..

- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు

విజయనగరం పూల్‌బాగ్: ప్రధాని మోదీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. లెనిన్‌బాబు ఆరోపించారు. సమగ్ర యువజన విధానం ద్వారా నిరుద్యోగ సమస్య నిర్మూలించవచ్చన్నారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రాయితీలు వినియోగించుకుని కోట్లాది రూపాయలు దోచుకున్న పెద్దల ఆస్తులను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. ఏఐవైఎఫ్ 22 రాష్ట్ర మహాసభలను ఫిబ్రవరి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. యుగంధర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, జిల్లా అధ్యక్షుడు వాసు, కార్యదర్శి అప్పన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సునీల్, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పరామర్శ..

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దల్లి సూరిరెడ్డి ఆదివారం ఉదయం గుండెపోటు మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి దల్లిపేట గ్రామానికి వెళ్లి సూరిరెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దల్లి శ్రీనివాసరావు, కార్యకర్తలు, తదితరులున్నారు.


ఆ ఊరు భోగీకి దూరం..

నెల్లిమర్ల రూరల్: సంక్రాంతికి ముందురోజు వచ్చే తొలి పండగ భోగీకి అందరూ సిద్ధమవుతారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా వేకువజామునే లేచి స్నానాలు పూర్తి చేసుకుని, కొత్త దుస్తులు ధరించి భోగి మంట వేస్తుంటారు. ఇది ప్రతి గ్రామంలో కనిపించే చిత్రం. అయితే మండలంలోని అలుగోలు గ్రామం మాత్రం అందుకు భిన్నం. గడిచిన 60 సంవత్సరాల నుంచి భోగి మంటను వేయడం లేదు. భోగీ తమకు కలిసి రాలేదని గ్రామపెద్దలు చెబుతున్నారు. అరవై ఏళ్ల కిందట భోగి మంట వేస్తే గ్రామానికి చెందిన ఒకరు మంటలో పడి చనిపోయడాని, అప్పటి నుంచి భోగిమంట వేయడం లేదని సమాచారం. కొన్ని సందర్భాల్లో యువకులు భోగి మంట వేయడానికి ప్రయత్నించినా, ఏదో ఒక కీడు సంభవించేదని పెద్దలు తెలిపారు. దీంతో భోగికి దూరంగా ఉంటున్నామని, అయితే సంక్రాంతి, కనుమ పండగలను ఘనంగా జరుపుకుంటామని చెప్పారు.



అలుగోలు గ్రామం

పెద్దల సూచనలు పాటిస్తున్నాం..



గ్రామంలో కొన్నేళ్లుగా భోగి మంట వేయడం లేదు. గ్రామపెద్దల ఆదేశాలు పాటిస్తున్నాం. అయితే ఆ రోజున గ్రామంలో ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తుంటాం
– సారిక వైకుంఠం, వైస్ ఎంపీపీ, అలుగోలు గ్రామం

పైడితల్లిని దర్శించుకున్న పాట్నా హైకోర్టు జడ్జి



పాట్నా హైకోర్టు జడ్జి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అమ్మవారి దేవస్థానం అధికారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని పాట్నా హైకోర్టు జడ్జి జి. అనుపమా చక్రవర్తి సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు వేదాశీస్సులు, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలోనే నిజమైన సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో ఆదివారం 50 మంది పేదలకు బియ్యం, గోధుమ నూక వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో తులసీ రామ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ..

విజయనగరం అర్బన్: సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలోని వంద మంది నిరుపేదలకు 15 రకాల నిత్యావసర సరకులను శిక్షకరణ ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు పంపిణీ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు బలివాడ బాల భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధూళికేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు కేవీ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ప్రభాకరరావు, జీఎల్‌వీ రమణమూర్తి, కేవీ సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

• దుస్తుల పంపిణీ

పూసపాటిరేగ మండలంలోని గోవిందపురంలో సంక్రాంతి నేపథ్యంలో సర్పంచ్ బాలా రామలక్ష్మి ఆదివారం వెయ్యి మంది పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్రాంతి పండగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, విక్రం జగన్నాథం, దంగుడుబియ్యపు ఈశ్వరరావు, బాలా గోపాలరావు, ఇనపకుర్తి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ



• ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి..

విజయనగరంలోని సిటీబస్టాండ్ వద్దనున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచే పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. – విజయనగరం టౌన్



• రక్తదాన శిబిరం

రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ కన్వీనర్ బి. సాయినాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంపై ఉన్న అపోహలను ప్రతి ఒక్కరూ విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో బి. రూప్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, వి. చైతన్యబాబు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్



• రంగవల్లులు మన సంస్కృతికి ప్రతీకలు



రంగు రంగుల రంగవల్లులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వాజీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. రంగురంగుల ముగ్గులతో ఆ ప్రాంతం ఆకర్షణీయంగా మారింది. – విజయనగరం టౌన్

ప్రయత్నం మానకూడదు..

- జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబ్జీ

విజయనగరం పూల్‌బాగ్: ప్రయత్నం చేసి ఓడిపో కానీ.. ప్రయత్నం చేయడం మానకూడదని స్వామీ వివేకానంద నేటి తరానికి ఇచ్చిన పిలుపును మరిచిపోరాదని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దవడ కొండబాబు అధ్యక్షతన ఆదివారం స్థానిక దుర్గమ్మ గుడివద్ద వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దివ్యాంగుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ.. విశ్వాసమే బలం.. బలహీనతే మరణమని చెప్పిన గొప్ప తాత్వికుడు వివేకానందుడని కొనియాడారు. వెలిగే సూర్యుడ్ని చూసి చీకటి భయపడుతుందనే సత్యాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని భీశెట్టి అన్నారు. సమావేశంలో శ్రీమతి అరుణమ్మ, మీనా నాయక్, మాతృభూమి సేవాసంఘ అధ్యక్షుడు ఇప్పలవలస గోపి, పౌరవేదిక ప్రతినిధి తాడేపల్లి నాగేశ్వరరావు, బలరాం, నర్సింహానంద భారతి స్వామీజీ, మమ్ముల తిరుపతిరావు, స్రవంతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.